www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
సోమవారం
31 మార్చి 2025

విలేఖరులు కావలెను

కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003



## గొప్ప నమూనా నగరంగా ఫ్యూచర్ సిటీ

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### రూ.వేలాది కోట్ల పెట్టుబడులతో యువతకు ఉద్యోగ అవకాశాలు

- దేశంలో కొత్త నగరాల నిర్మాణం జరగాలి
- హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపునకు కృషి
- రవీంద్ర భారతిలో ఉగాది వేడుకలు పాల్గొన్న సీఎం

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
ఒక గొప్ప నమూనా నగరంగా 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మించి, తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కేవలం జనావాస యోగ్యమైన నగరంగా కాకుండా రూ.వేలాది కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి, అన్ని వర్గాల యువతకు లక్షలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా 'ఫ్యూచర్ సిటీ'కి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ, పర్యాటక సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన వేడుకలో పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక చండీగఢ్ తప్ప ఒక సంపూర్ణమైన నగర నిర్మాణం దేశంలో ఎక్కడా జరగలేదనీ ఉన్న నగరాలే కాస్త విస్తరించబడ్డాయని చెప్పారు. నగరాల విస్తరణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రపంచంలో వెనుకబడిన దేశంగా ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కొత్త నగరాల నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశానికి ఆదర్శంగా మిగతా 2లో



## కొండగట్టు ఆలయ స్థానాచార్యులు కపింద్రకు రాష్ట్రస్థాయి పురస్కారం

కలంజ్యోతి, మల్యాల : జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన ఆలయ స్థానాచార్యుడు తిరుకోవేల కపిందర్ రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. కాగా.. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యన్, కమిషనర్ శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. అనంతరం శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు కపిందర్ ను అభినందనలు తెలిపారు.

## గ్రూప్ 1 ఫలితాల్లో బరీరాఫరీద్‌కు రాష్ట్రస్థాయి 68వ ర్యాంక్



కలంజ్యోతి, నిర్మల్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్ –1 ఫలితాల్లో నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ భార్య బరీరా ఫరీద్, రాష్ట్రస్థాయిలో 68వ ర్యాంకును సాధించి తమ ప్రతిభను చాటారు. బీసీ ఈ కేటగిరీలో మొదటి ర్యాంకును సాధించారు. కాగా.. బరీరా ఫరీద్ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి డాక్టర్ ఆఫ్ ఫార్మసీ డిగ్రీని పూర్తి చేశారు. సివిల్ సర్వీసెస్ కు సన్నద్ధమవుతున్న ఫరీద్ 2022 లో సివిల్స్ లో ఇంటర్వ్యూ వరకు చేరారు. హైదరాబాద్ కు చెందిన షేక్ ఫరీరుద్దీన్, షమీన్ ఉన్నిసాల కూతురు బరీరా ఫరీద్. బరీరా ఫరీద్ తండ్రి భారత వాయుసేనలో రిటైర్డ్ ఉద్యోగి. ఏడుగురు సంతానంలో బరీర ఫరీద్ అందరిలో చిన్నవారు. గ్రూప్ I ర్యాంకింగ్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు బరీర ఫరీద్ కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## రామయ్య బ్రహ్మోత్సవాలు షురూ



- ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణం,
- 7న పట్టాభిషేక మహోత్సవం
- వచ్చే నెల 12వ తేదీ వరకు నిత్య కల్యాణాలు రద్దు

2లో

2 కలంజ్యోతి
సోమవారం 31.03.2025 General News



## గొప్ప నమూనా నగరంగా
# ఫ్యూచర్ సిటీ

▸▸ మొదటిపేజీ తరువాయి

నిలబెట్టే, ప్రజలకు ఆదర్శంగా ఉండే విధంగా, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తేవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని సీఎం వెల్లడించారు. దాంట్లో భాగంగానే మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు వంటి ప్రాజెక్టులతో పాటు నగరానికి ఒక కొత్త ఫ్యూచర్ సిటీని నిర్మించాలని తలపెట్టినట్లు చెప్పారు. వేద పండితులు పంచాంగ పఠనం విన్నప్పుడు ఉప ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ గుర్తొచ్చిందని చెప్పారు. బడ్జెట్ కూడా షడ్రుచులతో కూడుకుని ఉందన్నారు. బడ్జెట్ లో కొన్ని నియంత్రణలు పాటించారని వివరించారు. చాలా అంశాల్లో ఉదారంగా ముందుకొచ్చారన్నారు. ఉప ముఖ్యమంత్రితో కలిసి జోడెద్దుల్లా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపించడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులు పండించిన పంటకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ గిట్టుబాట ధరలతో వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. పేదలకు వైద్యం అందించాలని, నిరుపేదలకు విద్యను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఆ రంగాలకు అధిక నిధులు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడులు రావాల్సిన అవసరముందన్నారు. శాంతి భద్రతలు పూర్తిస్థాయిలో అమలు కావాలన్న సీఎం అసాంఘిక శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆ దిశగా నిరంతరం తమ ప్రయత్నం జరుగుతూనే ఉంటుందన్నారు. ఒకప్పుడు పేదవాడు పండుగ పూట మాత్రమే తెల్లన్నం తినేవాడన్నారు. మొట్టమొదట కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.1.90 లకే కిలో బియ్యం పథకాన్ని, ఆ తర్వాత ఎన్టీ రామారావు రూ.2 లకే కిలోబియ్యం పథకం, ఆ తర్వాత దేశంలో ఆహార భద్రతా చట్టం తేవడం వంటి కార్యక్రమాలతో పేదవారి ఆకలిని దూరం చేసే దిశగా ప్రయాణం జరుగుతున్నాయన్నారు. శ్రీమంతులు తిన్నట్టుగా నిరుపేదలు సన్నబియ్యం తినాలన్నారు. తెలంగాణలో సన్నబియ్యం అత్యధికంగా పండించే దిశగా ప్రభుత్వం గిట్టుబాటు ధరలతో పాటు బోనస్ ఇవ్వడం ద్వారా రైతులను ప్రోత్సహిస్తుందని చెప్పారు. గతేడాది దేశంలోనే అత్యధికంగా వరి ధాన్యం ఉత్పత్తి సాధించుకున్నామనీ ఈ సీజన్ లో కూడా అత్యధికంగా పండిస్తున్నట్లు వివరించారు. రైతులు పండించిన సన్న బియ్యాన్ని పేదలకు పంచాలన్న ఒక గొప్ప లక్ష్యంతో, ఈ ఉగాది పండుగ పేదవారి ఇళ్లల్లో సంతోషాన్ని తెచ్చిపెట్టాలని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. తెలంగాణకు మంచి భవిష్యత్తు ఉన్నదని వేద పండితులు చెప్పినట్టుగా రాష్ట్రాభివృద్ధికి మంచి నిర్ణయాలు తీసుకుంటూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగ బద్ధమైన సంస్థలతో మంచి వాతావరణంలో అందరి సహకారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని సీఎం స్పష్టం చేశారు. తమ సంకల్పంలో, ఆలోచనల్లో స్పష్టత ఉందన్న సీఎం.. సంకల్ప బలం ఉంటే దేవుడు కూడా కరుణిస్తారని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2050' ప్రణాళికతో దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా ఒక అద్భుతమైన అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీసుకెళ్లాలని సంకల్పించామన్న సీఎం.. అందరి ఆశీర్వాదాలతో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడుతామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ , జూపల్లి కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రామయ్య బ్రహ్మోత్సవాలు షురూ



**కలంజ్యోతి, భద్రాచలం :** శ్రీసీతారామచంద్ర స్వామి వారి వసంత పక్ష తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం నవాహ్నిక మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. తొలుత పవిత్ర గోదావరి నది నుంచి పుణ్య జలాన్ని తీర్ధ బిందెతో మేళతాళాల మధ్య తీసుకువచ్చి నిత్య కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, విశేష స్నపనం, మృత్సంగ్రహణం, వాస్తు పూజలు ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 6న జరిగే స్వామి వారి కల్యాణ క్రతువులో పాల్గొనే రుత్వికులకు, అర్చకులకు దీక్షా వస్త్రాలు ఆలయ ఏఈఓ శ్రావణ్ కుమార్ అందజేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకం, పుణ్యహావచనం, విశేషాంగ స్నపన తిరుమంజనం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 5 వ తేదీ సాయంత్రం ఎదుర్కోళ్ళు ఉత్సవం, ఏప్రిల్ 6 న శ్రీరామనవమి, ఏప్రిల్ 7 న పట్టాభిషేకం ఉత్సవాలను ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా యావన్మంది భక్త జన సందోహం మధ్య మిథిలా ప్రాంగణంలో చేయనున్నారు. ఈసారి సుమారు లక్ష వరకు భక్తులు రామయ్య కల్యాణానికి రానున్నారని ఆ దిశగా అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. సాయంత్రం తాత గుడి సెంటర్ లో ఉన్న గోవిందరాజు స్వామి గుడి వద్ద మృత్సంగ్రహణం (పుట్ట మన్ను) సేకరించి ఆలయంలో వాస్తు పూజ,పుణ్యాహవాచనం పూజా కార్యక్రమంతో అంకురార్పణ నిర్వహిస్తారు.

**బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు..**

బ్రహ్మోత్సవాలకు దేవస్థానం రూ.2.50కోట్లతో ఏర్పాట్లు చేపట్టింది. మిథిలాస్టేడియంలో 31వేల మంది భక్తులు సీతారాముల కల్యాణం, మహా పట్టాభిషేకం చూసేలా తీర్చిదిద్దారు. ఎండల నుంచి భక్తులకు ఉపశమనం కలిగించేలా ఫాగ్ సదుపాయాలను స్టేడియం ఆవరణలో కల్పిస్తున్నారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ చొరవతో ఏర్పాట్లు చేస్తున్నారు. 50 టన్నుల భారీ ఏసీ, వంద కూలర్లు, 250 ఫ్యాన్లను కూడా అమర్చుతున్నారు.

**వేసవి దృష్ట్యా సదుపాయాలు..**

భద్రాచలం, పర్ణశాలలో భక్తులకు చలువ పందిళ్లను నిర్మిస్తున్నారు. మజ్జిగ, చల్లని తాగునీటి ప్యాకెట్లను ఇవ్వనున్నారు. భక్తుల కోసం 19 ప్రసాద, 60 తలంబ్రాల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. 200 క్వింటాళ్ల తలంబ్రాలను తయారు చేస్తున్నారు. నవమి అనంతరం పోస్టల్, ఆర్టీసీ కార్గో ద్వారా ప్రసాదాలు, తలంబ్రా లు పంపిణీకి చేయనున్నారు. భద్రాచలం రాలేని భక్తులకు దేవస్థానం ఆన్ లైన్ ద్వారా పరోక్ష పూజా కార్యక్రమాలు చేపట్టింది.

**భద్రతా ఏర్పాట్లలో పోలీస్ శాఖ..**

ప్రసాదాల కొరత రాకుండా 2 లక్షల లడ్డూలు, 10వేల పెద్ద లడ్డూలను తయారు చేయిస్తుంది. ప్రసాదాల నాణ్యతను ఎప్పటికప్పుడూ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పరిశీలిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో ప్రైవేటు ప్రసాదాల అమ్మకాలపై నిషేధం విధించారు. ఏప్రిల్ 6, 7 తేదీల్లో భద్రాచలంలో మద్యం షాపులను మూసివేయాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు. 2 వేల మంది పోలీసులతో ఎస్పీ రోహిత్‌రాజ్ , ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ భద్రతా ఏర్పాట్లు చేశారు.

**సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక**



ఈసారి సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. ఏప్రిల్ 6న ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. గత పదేండ్లలో అప్పటి సీఎం కేసీఆర్ రెండుసార్లు మాత్రమే వచ్చారు. రామదాసు శాసనం ప్రకారం సంప్రదాయంగా ముఖ్యమంత్రి రావాల్సి ఉంది. కేసీఆర్ రాకపోవడంతో అప్పట్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. గతేడాది పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా సీఎం రేవంత్ రెడ్డి రాలేకపోయారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి కోరినా నిరాకరించింది. ఈసారి కచ్చితంగా వస్తానని, ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తానని సీఎం రేవంత్ హామీ ఇవ్వడంతో అధికారులు ఏర్పాట్లు వేగంగా చేస్తున్నారు. ఆలయం చుట్టూ ఉన్న 45 ఇండ్లను భూసేకరణలో భాగంగా తీసుకున్నారు. ఇప్పటికే రూ.34 కోట్లను నిర్వాసితులకు చెల్లించారు. దాంతో మాడవీధుల విస్తరణ, ఇతర పనులకు ప్రభుత్వం నిధులు భారీగా మంజూరు చేసే అవకాశం ఉంది.

# పండగ పూట విషాదం

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఎల్లయ్యగూడెం గ్రామంలోని మాధవనగర్ కాలనీకి చెందిన సాంబయ్య (42) ఆదివారం విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. స్థానికులు చెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి వద్ద బట్టలు ఆరవేస్తుండగా ఇనుప తీగకు విద్యుత్ తీగలు తాకి ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పండగ పూట ఇలాంటి ఘటన జరగడంతో గ్రామస్తులు శోకసముద్రంలో మునిగారు.



కలంజ్యోతి 3
సోమవారం 31.03.2025 General News

# ప్రతి ఒక్కరూ సన్నబియ్యం తినాలి

## సీఎం రేవంత్ రెడ్డి

- అద్భుతమైన పథకం రూపొంచించిన ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు
- సన్న బియ్యం పథకం చరిత్రలో మిగిలిపోతుంది



**కలంజ్యోతి, నల్గొండ :** తెల్ల రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడు సన్న బియ్యం తినాలని ఈ పథకం తీసుకొచ్చామన్నారు. 'అద్భుతమైన పథకం రూపొంచించిన ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు.. భూమి కోసం భుక్తి కోసం పోరాటం చేసిన చరిత్ర ఉమ్మడి నల్గొండ జిల్లాది.. పౌరుషాల గడ్డ నల్లగొండ జిల్లా.. ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పినట్టే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ ఇచ్చారు. నల్గొండ జిల్లా తీర్పు, ప్రజా తీర్పుగా గుర్తిస్తారు. 25 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది, ఇందిరమ్మది.. రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న దొడ్డు బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఆ బియ్యాన్ని రూ.10 అమ్ముకుంటున్నారు. మిల్లర్లు ఆ బియ్యాన్ని కొని ప్రభుత్వానికీ అమ్ముతున్నారు. మిల్లర్ల మాఫియా చేతుల్లోకి దొడ్డు బియ్యం వెళ్లడం వల్ల రూ.10 వేల కోట్ల నష్టం జరుగుతుంది. మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించడం లేదు. ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందిగా అమలు చేస్తాం. బీఆర్ఎస్ ఎందుకు సన్న బియ్యం ఇవ్వలేకపోయింది. కేసీఆర్ తన ఫామ్ హౌస్ లో వరి సాగు చేసి.. రాష్ట్ర ప్రజలను మాత్రం వరి సాగు వద్దు అన్నారు. సన్న బియ్యం పథకం చరిత్రలో మిగిలిపోతుంది. ఎవర సీఎంగా ఉన్నా, ఏ ప్రభుత్వం వచ్చినా సన్న బియ్యం పథకం ఆపలేరు. రాష్ట్రంలో అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ ఎస్ఎల్ బీసీని నిర్లక్ష్యం చేశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జానారెడ్డి కొట్లాడితె ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ వచ్చింది. నల్గొండ జిల్లా మీద కోపంతోనే జిల్లా సాగునీటినీ నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రపంచంలో 8వ వింత కాదు.. ఏకైక వింత.. మీకు ఉరి వేసినా తప్పులేదు.. నా సంకల్పం మంచిది కాబట్టి నా జిల్లా ప్రజలు ఆశీర్వదించారు. ప్రజలు ఎంపీగా గెలిపించాను.. పీసీసీ అధ్యక్షుడిని అయ్యాను.. రైతుల గుండెల్లో ఇందిరమ్మ, సోనియమ్మ పేరు నిలిచిపోయేలా పని చేస్తాం. ఉత్తమ్ అడిగినవి అన్ని మంజూరు చేస్తాం' అని సీఎం రేవంత్ వెల్లడించారు.

# అంజన్నకు మాజీ ఎమ్మెల్యే పూజలు



**కలంజ్యోతి, మల్యాల :** విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులు హనుమాన్ దీక్షలు స్వీకరించారు.



# యాదగిరిగుట్టకు పాదయాత్ర

ఎమ్మెల్యే కె.పి వివేకానంద గెలిస్తే
పాదయాత్రగా వస్తానని మొక్కుకున్న బండా మహేందర్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గెలిస్తే జగద్గిరిగుట్ట నుండి యాదగిరిగుట్ట వరకు నడుచుకుంటూ వస్తానని షిరిడి హిల్స్ అధ్యక్షుడు బండా మహేందర్ మొక్కుకున్నాడు. మొక్కులో అందులో భాగంగా ఆదివారం జగద్గిరిగుట్ట యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కుత్బుల్లపూర్ ఎమ్మెల్యే గా కె.పి వివేకానంద గెలిస్తే నడుచుకుంటూ వచ్చి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శించుకుంటానని ఆ రోజు మొక్కుకున్నానని, ఆ మొక్కు తీర్చుకోవడానికి బయలుదేరడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.




# రంజాన్ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

**కలంజ్యోతి, నిర్మల్ :** రంజాన్ పండుగను పురస్కరించుకుని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల నిర్మల్, భైంసా పట్టణాల్లోని ఈద్గా లను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈద్గా, మసీదులలో, ముఖ్యమైన ప్రదేశాలలో పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దాదాపు 350 మంది సిబ్బందితో బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రార్థనా సమయంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. వాహనాల కోసం తగినంత పార్కింగ్ ఏరియా ను కూడా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు, నిర్మల్ పట్టణ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, భైంసా ఇన్స్పెక్టర్ గోపినాథ్, ఎస్బి ఇన్ స్పెక్టర్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



# నర్సాపూర్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** విశ్వావస్తు నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలను ఆదివారం నర్సాపూర్ మున్సిపల్ పట్టణంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పండుగ సందర్భంగా భక్తులు ఆయా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం వేళలో ఆయా ఆలయాల వద్ద గ్రామాల పురోహితులు పంచాంగం వినిపించారు.



# మాజీ ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదన్ రెడ్డి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఉండాలని కోరుకున్నారు. మచ్చలేని నాయకుడిగా పది సంవత్సరాలు నర్సాపూర్ నియోజకవర్గానికి చేసిన సేవలు ఎవరు మరువరానివన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌరీశంకర్ పాల్గొన్నారు.



## ఘనంగా ఉగాది వేడుకలు

**ముఖ్యఅతిథిగా హాజరైన**

**బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉగాది పచ్చడ పంపిణీ పంచాంగ శ్రవణం' కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ జ్యోతిష్యం, పంచాంగం అనేది మన భారతీయ సనాతన నిధి అని, పంచాంగం అనేది చెడును హెచ్చరిస్తూ మంచి వైపు నడిపే మార్గమన్నారు. అనంతరం ఎమ్మెల్యే షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్.నరసింహారెడ్డి, సలహాదారులు జి. బలవంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి ఆర్. మురళి గౌడ్, ముఖ్య ఉపాధ్యక్షులు లింగంగౌడ్, ఉపాధ్యక్షులు ఎన్. నాగేష్ కుర్మ, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణాచారి, కమిటీ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే సత్యం

## జీఐ షెడ్ల నిర్మాణానికి భూమి పూజ

**కలంజ్యోతి, మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈవో శ్రీకాంత్ రావు సన్నాయి మేళావాయిద్యాలతో పూలమాల వేసి స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఆయనను శాలువాతో సత్కరించిన అనంతరం అర్చకులు తీర్థప్రదాసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో జితేందర్ స్వామి పంచాంగ చదివి వినిపించారు. అనంతరం జీఐ షెడ్ల నిర్మాణానికి స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం రెండు షెడ్లను నిర్మిస్తున్నట్లు, ఒకటి వాహనాలు పార్కింగ్ స్థలంలో.. రెండోవది కల్యాణకట్ట ముందు భాగంలో సుమారు రూ.70 లక్షలు వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. భూమి పూజలో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, ఆలయ అర్చకులు, సీఐ నీలం రవి, ఎస్ఐ నరేష్ కుమార్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.







## అలరించిన ఉగాది కవి సమ్మేళనం

**కలంజ్యోతి, నిర్మల్ :** విశ్వావసు తెలుగు ఉగాదిని పురస్కరించుకుని నిర్మల్ లో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం అలరించింది. ఇందులో భాగంగా కవిత్వం సమాజంలో చైతన్యం కలిగించాలని, జాతిని మానవత్వం దిశలో నడిపించాలని పలువురు కవులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్టియు భవన్ లో నిర్మల భారతి సాహితీ క్షేత్రం, తెలంగాణా రచయితల వేదిక, డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ వారు సంయుక్తంగా విశ్వావసు నామ ఉగాది కవిసమ్మేళనం నిర్వహించారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా 51 మంది తెలుగు, ఉర్దూ కవులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, లక్ష్మణ్, నిర్మల భారతి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి పరమేశ్వర్, బి.వెంకట్, డా.అప్పాల కావేరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ అప్పాల చక్రధారి, తెరవే ఉపాధ్యక్షులు డా.ఉప్పు కృష్ణంరాజు ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు.కవులు చట్ల గజ్జారాం, డా.దామెర రాములు, బొందిడి పురుషోత్తం రావు, పోలీస్ భీమేష్, అంబటి నారాయణ, దీపక్, రెడ్ల బాలాజీ, పత్తి శివప్రసాద్, తోడిశెట్టి రవికాంత్, తుమ్మల దేవరావు, దేవీప్రియ, స్వాతి, సయ్యద్ హుస్సేన్, అన్సార్ అహ్మద్, ఫహీం, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.




## చిత్తారమ్మ తల్లిని దర్శించుకున్న కూన శ్రీశైలంగౌడ్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** గాజుల రామారంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ చిత్తారమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు, ప్రముఖులు శ్రీశైలంగౌడ్ కి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నూతన విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ అష్ట ఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వావ్.. గార్జియస్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అషికా రంగనాథ్ గతేడాది 'నా సామిరంగ' చిత్రంతో హిట్ సాధించింది. ఇక ఆ తర్వాత నటించిన 'మిస్ యూ' బాక్సాఫీసు వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అయినప్పటికీ అషికా రంగనాథ్ ఫుల్ ఫామ్‌లో ఉంది. తెలుగు, తమిళ ఇండస్ట్రీలో వరుస అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నది. ప్రస్తుతం అషికా గత వైభవ, విశ్వంభర వంటి సినిమాల్లో నటిస్తున్నది. అలాగే కోలీవుడ్ హీరో కార్తి సరసన 'సర్దార్-2' చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నది. 2022లో వచ్చిన 'సర్దార్' సినిమాకు సీక్వెల్‌గా రాబోతుండగా.. దానికి పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో మాళవిక మోహనన్, ఎస్ జే సూర్య, రాజిషా విజయన్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా అదిరిపోయే అప్డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఓ వీడియోను విడుదల చేస్తూ 'సర్దార్-2' అనౌన్స్‌మెంట్ రేపు రాబోతున్నట్లు ప్రకటించి క్యూరియాసిటీని పెంచేశారు. ఇక అషికా రంగనాథ్ వరుస షూటింగ్స్‌లో పాల్గొంటూనే సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నది. తాజాగా, ఈ భామ ట్విట్టర్ ద్వారా పలు ఫొటోలు షేర్ చేసింది. ఇందులో చీరకట్టులో ఉన్న ఆమె సాంప్రదాయ లుక్స్‌తో అందరినీ మెస్మరైజ్ చేస్తోంది. ఇక ఆ ఫొటోలను చూసిన నెటిజన్లు వావ్ గార్జియస్ అని కామెంట్స్ చేస్తున్నారు.



